
# భ్రమ



## జెమిని, కిరణ్మయి

ఆకాశంలో చుక్కలన్నీ తళతళ లాడుతున్నాయి. చుక్కలమధ్య చంద్రుడు మేఘాల మీద కూచుని ప్రవాహంలోకి మళ్ళే జారిపోతున్నాడు. బొగడ పువ్వులు యౌవనంతో ఒళ్లు విరుచుకుని మత్తు కలిగించే పరిమళాన్ని జల్లు జల్లుగా కురిపించి మనసుని తేలిక పరుస్తున్నాయి.

నరహరి ఇంటి ముందున్న వరండా చూరు క్రింద కూర్చుని ప్రకృతి అందిస్తూన్న ఆనందాన్ని అనుభవిస్తున్నాడంటే తప్పని ఒప్పుకోవాలి. మెదడులో ఏదో సంచలనం కలిగినప్పుడు, ఎడతెగని సమస్యలు దొలిచేసినప్పుడు పొగతాగేవాడికి సిగరెట్ మీదకి పోతుంది మనసు. సిగరెట్ చివరికి వచ్చి, వేలు చుర్రుమనేదాకా తను సిగరెట్ కాలుస్తున్నట్లు గాని, ఆ కాల్చటం వల్ల సుఖం ఉంటే అది అనుభవిస్తున్నట్లు గాని తెలియదు.

తన జీవితంలో సుఖం లేకుండా పోతూందని, అంతకంతకూ ఇరుకై పోతూందని అనిపించి చికాకు కలిగినప్పుడల్లా నరహరి గుహలాంటి ఇంట్లోంచి వచ్చి వీథి అరుగు మీద కూర్చుని ఆకాశం కేసి, నక్షత్రాలకేసి, మేఘాల కేసి చూస్తూ మనసుని సాంత్వన పరచటానికి ప్రయత్నిస్తాడు.

గుహలాంటి ఇల్లు, గొర్రెతోక లాంటి జీవితం, తలను అమ్మేసుకున్న తండ్రి, పెళ్ళికాని చెల్లెలు, అమాయకత్వం మూర్తీభవించిన తల్లి ఎంత స్థిరంగా మార్పులేకుండా కనిపిస్తారో, ఆకాశం, చీకటి, వెన్నెల, చంద్రుడు, ఉషోదయం, సంధ్య అంత నిశ్చలంగా కనిపించి, బరువెక్కిన గుండె మరింత బరువై, ఆహ్లాదానికి బదులు క్లాంతిని నింపుతుంది ప్రకృతి.

నరహరి చాలాసేపు చీకట్లోకి చూశాక తల్లి వచ్చి భోజనానికి పిలిచింది.

"బాబులూ! చాలా రాత్రయింది. భోజనానికి లే, నాయనా!" అంది.

తల్లి పిలుపుకి లోనికి వెళుతూ నరహరి అనుకున్నాడు:

'అమ్మ శుద్ధ వెర్రిది. వెర్రి బాగులది.'

తల్లి చూపించే ప్రేమకీ, ఆదరణకీ, తనమీద పెట్టుకున్న ఆశలకీ, తన మీద తనకి ఎప్పుడూ ఏర్పడని ఆత్మ విశ్వాసానికీ, భవిష్యత్తులోకి తొంగి చూడటానికి భయపడే మనసుకీ సంబంధించిన ఏదో నిజం ఆ రెండు వాక్యాల్లోనూ స్ఫురించింది.

హరికేన్ లాంతరు వెలుగులో రెండు ముద్దలు ఆవురావురుమని తిన్నాక, చాలాసేపు మౌనంగా ఉండిపోయినట్లు గుర్తొచ్చి, నిశ్శబ్దాన్ని భంగపరిచేందుకు తల్లిని ఏదో గుర్తు వచ్చినట్లు అడిగాడు:

"చెల్లాయేదీ? ఎవరింటికేనా వెళ్ళిందా?"

"హేమ వచ్చి పిలుచు కెళ్ళింది. ఆ అమ్మాయి పుట్టిన రోజుట. భోజనం చేసే వస్తుందేమో?" అని చెప్పి ఇంకొంచెం మజ్జిగ పోసింది తల్లి.

"హేమ పుట్టిన రోజా? నాకెందుకు చెప్పలేదూ?" అని అలా అడిగినందుకు సిగ్గు పడ్డాడు.

అతని అభిప్రాయం చెల్లెలు వట్టి

చేతులతో వెళ్లి ఉంటుందని, తనకు ముందుగా తెలిస్తే, తన స్నేహితుడు సుబ్బారాయుడు కొట్లో రవికగుడ్డ అరువు తీసుకొచ్చి అయినా చెల్లెల్ని పంపి ఉండేవాణ్ణి అన్న భావన ఉంది.


తల్లికి కొడుకు కడుపు నిండిందో లేదో ఎంత బాగా తెలుస్తుందో, మనమలో ఉన్న భావాలు ఇంకా స్పష్టంగా తెలుస్తాయి.

“నేను పంపించాను లేరా! నాలుగు రూపాయ లిచ్చి బజార్లో గుడ్డ కొని మరీ వెళ్లమని చెప్పాను” అంది తల్లి.

నరహరి భోజనం అయిందనిపించి లేచాడు. చెల్లెలు హేమతో అంతగా పూసుకు తిరగటం అతనికి సుతరామూ ఇష్టం లేదు.

హేమ వాళ్ల అన్నయ్య రవితో ఎన్న డైనా తను మాట్లాడాడా!

అయినా, హేమ నిజంగా హేమే! బంగారు బొమ్మలా ఉంటుంది. అందులో పుట్టిన రోజున తలంటు పోసుకుని, తెల్లటి టెరికాట్ చీర, జాకెట్ తొడిగితే, ఆకాశంలోని వెండి మబ్బు అరుణిమను కలుపుకుని బంగారు తీగలా మెరిసినట్లు భలేగా ఉంటుంది అనుకున్నాడు.



గుడి - గోపురం

ఫోటో—భట్టారం శ్రీనివాసులు (మద్రాసు — 2)

తన కో స్కూటర్ ఉండి (రవికి ఉన్న లాంటిది) సూట్‌లో 'రయ్' మని దూసుకు పోతూంటే, వెధవ టై ఎగిరి భుజాల మీద గాలికి మెడను చుట్టు కుంటూంటే, 'లవ్ లాక్' నుదుటను ముద్దు పెట్టుకుంటూంటే తను వాళ్ల గేటు ముందు స్కూటరు హఠాత్తుగా ఆపి హారన్ కొడతాడు.

అప్పు డేం జరుగుతుంది?

బహుశా హేమ బాల్కనీకి ఉన్న పలచటి గోడకి రెండు మోచేతులూ ఆన్చి, క్రీపర్ పక్కగా పచ్చగా, సుతి మెత్తగా నవ్వుతూంటే, హంస రెక్కలు విప్పు కున్నట్లు ఆమె విశాల నేత్రాల కున్న పిలి కవాటాలు 'టపటప' కొట్టు కుంటాయి.

చిన్న సైజు కల కన్న నరహరికి తలుపు దడదడమనేసరికి బ్రేకు పడింది.

చెల్లెలు రమ వచ్చి, “అన్నయ్యా, ఇంకా పడుకోలేదూ? అమ్మేది? వంటింట్లో ఉందా?” అని హడావిడిగా లోపలికి వెళ్లింది.

తల్లీ కూతుళ్ల మాటలు హేమా వాళ్లింటికి వచ్చిన స్నేహితులచుట్టూ, బంధువుల చుట్టూ తిరుగుతున్నాయి.

ఎవరెవరు ఏయే నగలు పెట్టు కొచ్చారో, ఏం చీరలు కట్టుకున్నారో, ఎన్ని ప్రజెంటేషన్లు దొరికాయో ఏకరువు పెడుతూంది రమ.

“ఏమే, రమా! హేమకి వచ్చే ఏడు పెళ్లి జరిపించేస్తారట. వాళ్ల బావ ఎవరో డాక్టరీ చదువుతున్నాట్ట” అంది తల్లి.

“అబ్బే! అంతా ఉత్త కబుర్లు. అసలు దానికి పెళ్లి చేసుకోవాలని లేదుట. ఇంకా చదువుతుందట. అయినా, అమ్మా, అది బావని చేసుకోదే” అంది రమ.

నరహరికి కొంచెంగా పడుతున్న నిద్ర వదిలిపోయింది.

‘స్వయాన బావ. అందులోనూ డాక్టరు. దీని కిదేం జబ్బు? కొంపదీసి ఎవణ్ణో ప్రేమించలేదు కద?’ అను కున్నాడు.

“ఎవరో ఆదిశేషయ్య గారి కొడుకట. అయిదుగురు కొడుకుల్లోనూ పెద్ద వాడూ, బుద్ధిమంతుడూ నట. బి. ఎ. పాసై నాలుగేళ్లుగా ఉద్యోగం చేస్తు న్నాడట. మీ నాన్న కెవరో కబురు చేశారు కదిపి చూడమని. ఈ సంబంధం కుదిరితే చేసుకుంటావు టే?” అని అడిగింది తల్లి.

రమ ఏం సమాధానం చెప్పిందో వినిపించలేదు నరహరికి. అయినా, చెల్లెల్ని అంత నేరుగా అడిగెయ్యటం నచ్చలేదతనికి.

తండ్రి అర్ధరాత్రి దాటాక ఒక గంట తరవాత కానీ రాలేదు. అంతదాకా మెలకువగానే ఉన్నాడు నరహరి.

“ఏమిటో ఈ సినిమా ఆపరేటరు ఉద్యోగం అంత దరిద్రం ఇంకేం లేదురా, బాబులూ! రాత్రిళ్లు నిద్రలేక పగటిపూట తిప్పినట్లుగా ఉంటోంది తలకాయ. మిల్లులో తప్పుడు లెఖ్ఖలు వ్రాస్తే షావుకారు తాడెత్తు లేస్తాడు” అన్నాడు తండ్రి, మూత పెట్టి ఉంచిన అన్నం తిని, బొంత పరుచుకుంటూ.

“చెల్లెలికి ఏదో సంబంధం వచ్చిం దటగా, నాన్నా? నాతో చెప్పలేదేం?” అనడిగాడు నరహరి.

“దీనికి చదువా అబ్బటం లేదు. ఎస్సెసెల్సీ మూడుసార్లు కలిపి ఒక్క దానిలో పాసు కాలేదు. కుర్రాడికి కొంచెం ఆస్తి ఉన్నట్లుగా ఉంది. ఇల్లు తాకట్టు పెట్టైనా, ఇది ఖాయంచేస్తే బాగుం టుందిరా, బాబులూ” అన్నాడు తండ్రి.

నరహరి కాబోయే బావగారి గురించి ఆలోచిస్తూంటే, తండ్రి గురక వినిపించింది.

నిర్విచారంగా తల్లిని అంటుకుని పడుకున్న చెల్లెలికేసి చూసేసరికి నరహరి హృదయంలో కలుక్కుమంది.

‘తల్లినీ, తండ్రినీ, చిన్నప్పటి నుంచీ పుట్టి పెరిగిన ఇంటినీ, స్నేహితుల్నీ మరిచిపోయి ఇంకో కొత్త ఇంట్లోకి అడుగుపెట్టి జీవితాన్ని పునః ప్రారంభం చెయ్యటం ఎంత కష్టం? కొత్త మనుషుల్ని, పరిసరాల్ని తనవిగా చేసుకుని ఈచంటిది ఎలా బతుకుతుంది, పాపం?’ అనుకున్నాడు.

‘చచ్చినా ఆడపిల్లగా పుట్టకూడదు’ అని గట్టిగా మనసులో అనుకున్నాక, తన స్వార్థానికి నవ్వొచ్చిం దతనికి.

‘లేదు. దీనికేం బాధ కలగకుండా నెలనెలా పోయి చూస్తుండాలి. వీలైతే సంవత్సరానికి ఆరు నెలలు పుట్టింట్లోనే ఉంచెయ్యాలి’ అనుకుని మనసు తేలిక పరుచుకున్నాడు.

తండ్రి నిద్రలో బాగా కలవరిస్తు న్నాడు. ఆకతాయి కుర్రాళ్లు విసిరిన రాళ్లకి కాలు విరిగిన కుక్కపిల్ల 'కుయ్యో !' మన్నట్లుగా ఉం దా కలవరింత.

ఈ బి. ఎస్‌సి. అయిపోతేనా? అని అనుకున్నాడు గట్టిగా. కానీ, అయిపోయిన తరవాత ఏం చెయ్యదలుచుకున్నాడో అతనికి తెలియదు. రెండేళ్లుగా పోతూన్న పరీక్ష గట్టెక్కే సూచన కూడా కనుచూపులోకి అందలేదు.

పోనీ, చదువు ఎత్తేసి ఉద్యోగంలో చేరితే తండ్రికి చాలా సహాయంగా ఉంటుందేమో? అన్న ఆలోచన వచ్చింది.

ఊహూ! ఈ ఇబ్బందులు కలకాలం నిలిచేవి కావు. బి. ఎస్‌సి. ఎలాగో అయిం దనిపించి ఇంకో రెండేళ్లు కళ్లు మూసుకు గడిపేస్తే పోస్టు గ్రాడ్యుయేట్ వస్తుంది. ఆ తరవాత ఎవరు చూశారు? ఫస్ట్ క్లాస్ ఆఫీసర్ కావచ్చు. వందల మంది ప్యూన్లు తన కింద ఉంటారు. బంగళా కొంటాడు. కారులో తండ్రిని తిప్పుతాడు. తల్లికి

నగలు చేయిస్తాడు. చెల్లాయికి రెండు పెట్టెల నిండా చీరలు కొని పంపిస్తాడు.

ఆ తరవాత?

ఆ తరవాత హేమను ప్రేమించే ప్తిడు ... హేమ బ్రదరు రవిగాడి లాటి మనుషుల్ని జోకువేసి చిత్తు కొట్టం చేస్తాడు.

'హేమా! నీ పెళ్లి వాయిదా పడింది నాకోసమే! ఎవ డా బ్రూట్ బావ? బోడి డాక్టరే కదా! "ఐ కేర్ ఎ హేంగ్ ఫర్ హిమ్" అని అనుకున్నాక ఎందుకో డాక్టర్లందరి మీదా వల్లమాలిన కోపం వచ్చింది. మెడలో పాములాగ స్టెతస్కోపు, పాము కుబుసం లాగ తెల్లని కోటు... కప్పుల్ని, బల్లుల్ని కోస్తూ హృదయం లేని రాక్షసుల్లాగు కనిపించారు.

డాక్టర్ని మించిన పెద్ద ఉద్యోగం ఏమిటని ఆలోచించి, ఆలోచించి, చివరికి సైంటిస్ట్ మంచి మర్యాదగా ఉండే నౌకరి అని తేల్చుకున్నాడు.

హేమ కళ్ళు చాలు, ప్రపంచాలన్నీ ఖమిడిపోతాయి. ఒక నవ్వు — కోటి వసంతాలు గిరగిరా తిరిగి విశ్వంలో ప్రతి అంగుళం ఒక నందనవన మవుతుంది.

ఆలోచనలతోనూ, ఆశలతోనూ, ఉత్సాహంతోనూ, భయంతోనూ మెదడు వేడెక్కిపోయింది. గుండె బరువెక్కిపోయింది.

తెల్లవారుఝామున చాలా మంచి నిద్ర పట్టింది నరహరికి.

* * *

ఇంకో ఏడాది నరహరి, తల్లి, తండ్రి ఓపికపట్టి చూశారు. నరహరి పరీక్ష మళ్లీ పోయింది.

"ఉద్యోగంలో చేరకూడదట్రా, నాన్నా?" అన్నాడు తండ్రి.

"నాయనా! ఉద్యోగంలో చేరి ప్రైవేటుగా కడుదువుగానిలే. పాసయితే ఉద్యోగం మానేసి చదువుదువుగాని" అంది తల్లి.

నరహరి చేసేది లేక ఉద్యోగం కోసం దరఖాస్తులు పెట్టడంమొదలుపెట్టాడు.

చెల్లెలి కొచ్చిన సంబంధం తప్పి పోయింది. మళ్లీ ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షకి కట్టింది.

హేమ తన కళ్ల పడకుండా తప్పుకు తిరుగుతున్నాడు నరహరి.

కనీసం కలలు కనటానికి పునాదులు లేచిపోయాయి.

ఎక్కడో గుమాస్తా ఉద్యోగం దొరుకుతుంది తనికి—డాక్టర్‌ని 'ఫస్ ఫో' అన్న అమ్మాయి —

నాగరాజుతో స్నేహం కుదిరింది నరహరికి. నాగరాజు నల్లగా, లావుగా, కొండచిలువలా ఉంటాడు. ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసులో పని చేస్తున్న నాగరాజులో ఒక ఆకర్షణ నరహరిని దగ్గర చేసింది.

నాగరాజు నవ్వుతాడు. నవ్విస్తాడు. రోజులు చాలా త్వరగా దొర్లిపోతాయి. అతనితో. నాగరాజుకి ఒక కళా సమితి ఉంది. దానికి మద్దత్తుగా ఒక 'గూండా సమితి' కూడా ఉంది.

నాగరాజులో ఒక తమాషా అయిన వ్యక్తిత్వం కూడా ఉంది.

నచ్చి వేశ్యతో పరాచికాలాడ్డంలో ఎంత జంకు లేకుండా శృంగారానుభూతి పొందగలడో, ఒక మంచి కవిత్వాన్ని అంత సిన్సియర్‌గా, భావుకుడుగా ఆనందించ గలడు.

కొన్నాళ్ళుగా నరహరి వచన కవిత్వాన్ని వ్రాస్తున్నాడు. అది కూడా ఇక తన చదువు సాగదని, భవిష్యత్తు 'కరా రావుడ్డై' పోయిందని అనుకున్న దగ్గరి నుంచీ.




BSCM-1/72TEL

అలా అని నరహరికి సాహిత్యం అంటే తేలికఅయిన అభిప్రాయం ఉందను కోవటం శుద్ధ తప్పు. అదీ కాకుండా నరహరి చదువు సాగకపోవటానికి కారణం తెలివి తేటలు లేకపోవటం కాదు.

నరహరి పుస్తకం పట్టుకువి శ్రద్ధగా ఒక అరగంట చదవలేడు. అతడు పూర్తిగా కలల మనిషి. పగ్గాలు వేసి జీవితాన్నే కాకుండా, కలల్ని శాసించలేడు.

ముఖ్యంగా హేమను గురించిన భావాలు చాలా వరకు ఆ కలల్లోంచి పుట్టుకొచ్చినవే!

అందువల్లే, జీవితం దెబ్బతిని పోయిం దన్న భావం, హేమ అందరాని వస్తువుగా మిగిలిపోయిందన్న విచారం ఆవేశంగా మారి సారస్వత సృష్టికి పురిగొల్పాయి.

అందుకే అతనికి తను చేసే రచనల మీద కూడా నమ్మకం తక్కువ. ఆవేశ జనితమైందనీ, ప్రయోజనాత్మకం కాలేదనీ!

ఉద్యోగం లేదు కాబట్టి, నాగరాజు వెంట మంత్రించినట్లు తిరిగాడు నరహరి. నాగరాజు నరహరి కవిత్వాన్ని మెచ్చుకుని, అతనిచేత ఒక నాటకాన్ని వ్రాయించి 'స్టేజి' చేయించాడు.

నరహరి పరపతి ఊర్లో పెరిగింది. నాగరాజు ఏదో ఒక మాటలో, క్రియలో తన ఆధిక్యాన్ని ప్రదర్శించేవాడు. నరహరి పరపతి మామూలుగానే పెరుగుతూందని ప్రతి క్షణం గుర్తుచేసే వాడు.

తనకి అవకాశం ఇచ్చి, ప్రోత్సహించి నందుకు, వెలుగులోకి తెచ్చినందుకు నాగనాజు పట్ల నరహరికి కృతజ్ఞత లేక పోలేదు. కానీ, రానురాను నాగరాజులోని భరించలేని సుగుణ సంపద నరహరికి జుగుప్స కలిగించేది.

తోటి మనిషిని గౌరవించటం అనేది నాగరాజు ఊహకి అందని విషయం. తనకంటే తక్కువ 'లెవెల్'లో ఉండే మనిషిని గుండెను కోసే మాట లనటం లోనూ, అవమానించటంలోనూ, వేటాడే ఆనందంతో నాగరాజు మొహం వికసిం చేది.

తనకంటె పెద్ద చేతుల్ని తంత్రాలు, కుతంత్రాలు పన్ని నలుగురిలోనూ చెడ్డ వాళ్ళగానో, చేతగాని వాళ్ళగానో తెలుపుడు చెయ్యటానికి అవస్థ పడేవాడు. వాళ్ళని దద్దమ్మల్ని చేశాక, తన మంచి తనం, లేని అమాయకత్వం, నీకేం ఫర్వాలేదన్న ధీమా కలిగించి మచ్చిక చేసి కుక్కల్లా తిప్పుకునే వాడు.

నాగరాజునుంచి తప్పించుకుందామన్న నరహరికి కళ్ళాలు వేశాడు నాగరాజు.

తనకు నచ్చిన మరో మంచి స్నేహి తుడితో మాట్లాడ్డానికి భయం వేసేది నరహరికి.

ఇద్దరి మధ్యా ఏదో కుతంత్రంపెట్టి, మంటని రేపటం అతని అరిచేతి విద్య.

అందుచేత, అసూయతో నిప్పులు కక్కే నాగరాజుకి కోపం తెప్పించేట్లు ప్రవర్తించటంకన్నా, అతని చుట్టూ తిరిగి మంచి చేసుకోవటం నయంగా కనిపించింది నరహరికి.

ఊర్లో వాళ్ళంతా ఇద్దరికీ చాలా గొప్ప స్నేహం అనుకునేవాళ్ళు.

నాగరాజు తనని ఎందు కిలా వెంట బెడుతున్నాడా అని నరహరి ఆలోచించిన మీదట ఒక కారణం తెలిసింది.

నాగరాజుకి ఉన్న చాలా రకాల అల వాట్లకి రాత్రి తనతోపాటు అర్ధరాత్రి దాకా తిరిగే మిత్రుడు ఒకడు కావాలి. నాగరాజులో పొరపాటున మిగిలిపోయిన ఒక కళాభిమానం ఉంది. నరహరికి ఆ నిషా పట్టించగలిగి నట్లుగా మరొకణ్ణి ప్రభావితం చెయ్యలేడు. నరహరి నలుగురి దృష్టిలోనూ బుద్ధిమంతు నిడపించు కుంటూన్న కుర్రాడు కాబట్టి, తమ బేవార్సుగా తిరిగే తిరుగుళ్ళకి ఈ తెర కొంచెం మరుగ్గా ఉంటుంది.

అందుచేత నాగరాజు పొరపాటున కూడా నరహరిని చీకటి తప్పుల్లోకి దించ లేకపోయాడు. అతనితో మాట్లాడి నప్పుడు కూడా తన సంస్కార దారిద్ర్యం బయట పడకుండా జాగ్రత్త పడేవాడు.

అర్ధరాత్రి ఒంటిగంటకి దొంగలా ఇల్లు చేరటం నరహరి చర్య అయింది.

అప్పుడప్పుడు తండ్రి అతని కంటే ముందుగానే సినిమా హాలు నుంచి వచ్చి పడుకునే వాడు.

"అలా అర్ధరాత్రి వరకూ తిరిగే బదులు పరీక్షకి కట్టకూడదూ?" అని తల్లి మందలించి తిట్టి విసిగిపోయి, చివరికి గాలికి వదిలేసింది.

తండ్రి కోపంతో ఏ మూడు నెలలకో ఓ సారి చిందులేసినప్పుడు నరహరి మౌనం వహించేవాడు. తరవాత కార్య క్రమం మామూలే అయేది.

నాటకాలు, స్నేహితులు (నాగరాజు మనుషులు) అర్ధరాత్రి చెక్‌గేటు కాంటీన్‌లో టీ త్రాగటం, హైస్కూలు మైదానంలో పడుకుని నక్షత్రాల కేసి చూస్తూ పరిషత్ పోటీల్లో ఫస్ట్ప్రైజు, ఆ తరవాత సినిమా ఛాన్సు వగైరా కలలు కనటంలో, ఇల్లు, ఆర్థిక దుస్థితి, చదువు, ఉద్యోగం జ్ఞాపకం వచ్చేవి కావు.

ముఖ్యంగా హేమ ... హేమని చూడ టానికి ఇంట్లో ఉండే తీరిక చిక్కేది కాదు. ఆమె గురించి ఆలోచనలు చేయ టానికి అవకాశం ఇచ్చేవాడు కాదు.

నాగరాజు తన వెనకాల వెటకారం చేస్తున్నట్లు, మిగతా స్నేహితులతో వెకిలిగా మాట్లాడుతున్నట్లు అనుమానం వచ్చినా, రూఢిగా తెలిసినా, తనకోసం అతను వెంపర్లాడ్డం, తన రచనల మీద గురి ఉండటం, అతనితో తిరిగే రౌడీలు తనకి సలాములు చేయటం గర్వంగా ఉండేది.

రోజురోజుకీ క్షీణిస్తూన్న తండ్రి ఆరోగ్యం, ఘల్లుమంటూన్న ఇనుప గజ్జెల నృత్య విన్యాసం నరహరి గమని స్తూనే ఉన్నాడు.

'ఏదో ఒకటి చెయ్యాలి. ఇంట్లో పరిస్థితి దిగజారిపోతూంది. నాన్నచేత రాత్రింబవళ్ళు అరవ చాకిరీ మాన్పిం చెయ్యాలి. అమ్మకి బ్లడ్ ప్రెషర్ వస్తూంది. రేపు బలవంతంగా జనరల్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి' అనుకుంటూనే ఉన్నాడు.

ఆవేళ నరహరి నాగరాజుతో ఊరంతా సర్వేచేసి, ఒక బ్రహ్మాండమైన నాటకానికి సన్నాహాలు చేసి అర్ధరాత్రి ఇంటికొచ్చే టప్పటికి తల్లి ఇంకా మెలకువగానే ఉంది.

సిగ్గుపడుతూ— "ఇంకా పడుకోలేదా, అమ్మా?" అని అడిగాడు.

"తల తిప్పినట్లుగా ఉంటోందిరా. అయినా, భోజనం లేకుండా ఏమి టా పాడు తిరుగుళ్ళు? కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందిట. నువ్వు ఇంత రాత్రి దాకా తిరుగుతోంటే, మనసులో ఏదో కీడు ఊహించి భయం వేసి నిద్ర పట్టలేదు. నువ్వు ఒక్కడే మగ నలుసు పుట్టడం మా ఖర్మ. లే! ముందు భోజనం చేద్దువుగాని" అని నిలబడి గోడ ఆసరాగా చేసుకుని వంటింట్లోకి వెళ్ళింది.

నరహరికి తనమీద తనకే కోపం వచ్చింది. ఏమి టీ వెర్రి తనకి? ఏమి టీ పలాయనం? రిక్షా తొక్కి, కూలిచేసి తల్లిని, తండ్రిని పోషించినట్లు నాటకాలు రాస్తాడు. కథ లల్లుతాడు. తన గుండె ఎందు కిలా కరకుగా తయారవుతూంది?

"అమ్మా! నీకు బ్లడ్ ప్రెషర్ ఎక్కు వవుతోంది. హాస్పిటల్‌కి వెళ్ళాలమ్మా" అన్నాడు.

"నాకేం భయం లేదురా! ముందు నీ చదువు, ఉద్యోగం చూడు. మమ్మల్ని సుఖపెడుదువు గాని" అంది తల్లి.



సాధారణంగా స్నేహం అనేది మనిషి వ్యక్తిగతమైన విలువల కన్నా, అభిరుచిని బట్టి కలుస్తుంది. నాగరాజునీ, నరహరినీ ఇంతకుముందు పట్టి ఉంచింది వాట శాలే అనుకోవాలి.

ఆనందరావు నటుడే కాకుండా, కొంచెం కులాసా పురుషుడు. నాగరాజులా కాకుండా ఎదుటి మనిషి వ్యక్తిత్వాన్ని గౌరవించటం, ఒక్కొక్క స్నేహితుడికి ఒక్కో అర హృదయంలో కేటాయించటం నరహరిని అమితంగా ఆకర్షించింది. నరహరి కూడా స్వేచ్ఛని ప్రేమించే మనిషి. స్నేహం అంటూ ఇరవై నాలుగు గంటలూ ఒకడితోనే తిరగాలి, ఒకటే గాలి, నీరూ పీల్చాలి అన్న అభిప్రాయాన్ని హర్షించలేని మనిషి.

మూర్తి విషయంలో నరహరి తను ఇన్నాళ్ళుగా గుర్తించలేని నిజాన్ని కని పెట్టాడు. హంసక్షీర న్యాయంలా మనిషిలోని మంచినే ప్రేమించే మూర్తి నైజం అతనికి దగ్గర చేసింది. నరహరికి ఇంతకుముందు బాల్య స్నేహితులూ, హృదయాన్ని విప్పి చెప్పుకోతగ్గ మిత్రులూ చాలా మంది ఉన్నా, ఎవరికి వాళ్ళు ఒక పరిధిని గీసుకుని, స్నేహాన్ని నిలుపుకోవాలనే పట్టుదలతో, చేతులు చాచి కౌగిలించుకోవటం తప్పించి, కొవ్వొత్తులా మండి స్వార్థం అనేది కరిగించేసి, దీపంలా స్వచ్ఛంగా వెలిగిన మనిషి కనిపించ లేదు.

ఆ తరవాత మూర్తి కూడా కథలు వ్రాసేవాడు. చాలా విషయాల్లో దృక్పథాలు ఒక్క తాటిమీద నిలిచేవి.

శాస్త్రి ఈ ఇద్దరికీ కొంచెం భిన్నంగా ఉండే మనిషి. అనవసరమైన విషయాల్లో జోక్యం కలగ జేసుకోవటానికి ఓపిక లేని మనిషి. చెప్పాలంటే సాహిత్యంలోనూ, సంగీతంలోనూ కూడా కొంచెం ప్రవేశం ఉంది. కాని, కృషి చేసేందుకు ఓపిక లేక సాహిత్యాన్ని చదివి, సంగీతాన్ని విని రసానుభూతి చెందటంలో సంతృప్తి చెందటం మంచిదన్న నిర్ణయాని కొచ్చాడు. అందువల్ల నరహరికి మొదటి శ్రోత, విమర్శకుడు, ఆ తరవాత క్రమంగా స్నేహితుడు శాస్త్రి. కొన్నాళ్ళ స్నేహం తరివాత శాస్త్రిది చాలా మన్నిత మైన మనస్తత్త్వం అనీ, ఏమాత్రం అతిగా ప్రవర్తించినా, హాస్య మాడినా, చిన్నబుచ్చుకుంటాడనీ తెలుసుకున్నాక అతనికి తగ్గట్లుగా అడ్జస్ట్ అయిపోయాడు నరహరి.

నరహరి మొదటి నెల జీతం అందుకున్నాక, బజార్లో బాకీలు చెల్లించాక డెబ్బయి రూపాయలు మిగిలాయి. ఇంటి నుంచి తెచ్చిన వంద రూపాయలు ఎందుకయినా మంచిదని పాస్‌బుక్‌లో వేశాడు. ఇంటికి పంపుదామన్న ఆలోచన వచ్చింది. ఏం బుద్ధి పుట్టిందో, బి. ఎస్‌సి. పరీక్షకి ఫీజు చెల్లించి, రెండో నెలనుంచీ పంపుతానని, కొత్తగా రావటం మూలాన కొన్ని అత్యవసరమైన వస్తువులు కొనవలసి వచ్చిందని ఇంటికి వ్రాశాడు.

జీవితం లోతుల్లోకి చూడటం, మనిషి తన కాళ్ళమీద తాను నిలబడ డంతో ప్రారంభ మవుతుం దన్న సత్యం నరహరికి కొంచెం కొంచెంగా తెలుస్తూ వచ్చింది. దానికి దాఖలాగా, వచ్చిన రెండు మూడు నెలల్లో జరిగిన సంఘటనలు ఆ అభిప్రాయాన్ని అంగీకరించాయి.

"చూడండి, నరహరిగారూ! ఒక్క పది రూపాయలు. వచ్చే నెల జీతం రాగానే సర్దేస్తాను" అన్న నారాయణ రెండో నెల కూడా ఇవ్వకపోగా తనని చూస్తే తల వంచుకుని ఇంకేదో సెక్షనులోకి పనున్నట్లుగా వెళ్ళిపోయే వాడు.

'ఫర్వాలేదు. మీకు వీలున్నప్పుడు ఇవ్వండి' అని నరహరి చెవుదామనుకునే వాడు. నలుగురు పిల్లలతో సంసారం ఏభైతో నెట్టుకొస్తూన్న నారాయణ బాకీ చెల్లించలేకపోవటంలో అతనికి తప్పు కనిపించలేదు.

కాని, నారాయణలో ఇంకో చిత్రమైన మార్పు కనిపించింది. నరహరిని చూస్తే నొసలు చిట్లించే వాడు. బెదిరి పోయినట్లుగా వెళ్ళిపోయే మనిషి కోరి పిలిచి ఏదో తగవులాటకి దిగేవాడు.

నారాయణకి ఏదో ఎరియర్స్ అందాక ఆ పది రూపాయలు తిరిగి ఇచ్చేస్తూ, "చూడండి, నరహరిబాబూ! చాలా ఆలస్యమై పోయింది. ఇంకొకళ్ళయితే రోడ్డుమీద నిలబెట్టి అడిగేవాళ్ళు. ఇంకా నాకు నెత్తిమీద వెంట్రుకల మొత్తం అన్ని అప్పులున్నాయి. కానీ, మీ పదీ, ఇవ్వకపోతే నా మనసుకి శాంతి ఉండదు" అని చెప్పి వెళ్ళిపోయాడు. మర్నాటినుంచీ అతను చాలా స్నేహంగా పలకరించేవాడు. ఆ చిరాకు, కోపం, కసి మచ్చుకయినా కనిపించేవి కావు.

ఇంకోసారి ఆఫీసులో చాలా పెద్ద ఫీస్ట్ అయింది. ఆఫీసరు వెళ్ళిపోతూ తాను చాలాసార్లు తొందరపడి స్టాఫ్‌ను అవస్థపెట్టి ఉండవచ్చని, అంతా మరిచిపొమ్మని చెబుతూన్నప్పుడు, అతణ్ణి బూతులు తిట్టిన మనుషులు కన్నీళ్ళు పెట్టుకున్నారు. శత్రుత్వంలో కూడా సన్నని పొరలాంటి అభిమానం అవ్యక్తంగా ఉంటుందని తెలిసి నరహరి ఆశ్చర్యపోయాడు.

అదే రోజు — మిగిలిపోయిన ఎంగిలి మెతుకుల్నీ, విస్తరాకుల్నీ ఆత్రంగా ఏరి బుట్టలో వేసుకుంటూన్న బిచ్చగాళ్ళ మంద గొడవ చేసింది. ఒక ముసిల్ది ఎన్ని రోజుల నుంచి ఆకలితో ఉందో పాపం — పక్కనున్న పదేళ్ళ పిల్ల



# భ్రమ




— జెమిని, కిరణ్మయి

చేతిలో ఎంగిలాకు లాక్కుని ఆబగా తినేసింది.

ఆ పిల్ల బిక్క చచ్చి ఏడుస్తూంటే, జనార్ధనం గేటు దగ్గర ముసిలిదాన్ని చూసి —

"ఆ పిల్ల మెతుకులు దొంగలాడతావే, దొంగ ముండా! అడిగితే నేను వెయ్యనూ!" అని దాన్ని రెక్క పట్టుకు ఈడ్చుకొచ్చి ఓ విస్తరి నిండా అన్నం తెచ్చి వడేశాడు.

ఒక్క క్షణం ఆ ముసిల్ది తన మనవరాలి ఈడుండే ఆ పిల్లకేసి చూసింది పిచ్చిగా. తరవాత ఆ అన్నాన్నంతా విసిరేసి పెద్ద పెట్టున ఏడ్చేసింది.

"నాను దొంగముండనా — నాను దొంగ ముండనా!" అని ఆకలితో ఖాళీ కుండ పెంకు పట్టుకుని వెళ్లిపోయింది.

అలా అర్ధాకలితో ముసిల్ది వెళ్లిపోయాక వరహారికి మొట్టమొదటిసారిగా లక్షలు మూలుగుతూన్న షావుకార్ల మీద, కార్లమీద తిరుగుతూన్న దేశ నాయకుల మీద, వాళ్లను పీమవందుల్లా పెంచుతూన్న ప్రజలమీదా, జనానికి కూడు పెట్టలేని దేశం మీదా కోపం వచ్చింది.


ప్రేమ, జాబిలి, జాజులు, జవరాలు వదిలేసి, రాళ్లెత్తిన కూలీలు, బుగులుకునే బుక్కాగుండ, ఆకలి, చీకటి, మృత్యువు లాంటి కథలు వ్రాశాడు. అప్పటికి గాని అతని జ్వరం చల్లారలేదు.

శ్రీ శ్రీ, కొడవటిగంటి కాకుండా, కార్ల్ మార్క్సుని వగం చదివిన తరవాత తను తగలేసే సిగరెట్టు ముప్పయ్ రూపాయలు దాటుతున్నాయనీ, సెంటోకాకుండా, ఇంపాలా కారే కాకుండా, ఒక సీటుగా ఉండే బంగళాతో ఆగకుండా, రష్యన్ ఓడ్కా టేస్ట్ కోసం జిహ్వ తహతహలాడుతూందనీ, అట్లాంటి చేంతాడు కోరికల లిస్టు మనసులో భద్రంగా ఉందని తెలిశాక సిగ్గుపడి ఆ లిటరేచరు చదవటం మానేశాడు. కాని, వరహారిని నీడలా వెంటాడుతూ వచ్చిన అశాంతి, అసంతృప్తి ఎక్కువవుతూనే వచ్చాయి.

ఈతిబాధల వల్ల ఏర్పడుతూన్న ఖాళీ అని ఒప్పుకోవటానికి అతనికి మనస్కరించలేదు. వమయానికి డబ్బు ఇబ్బంది కలిగినప్పుడు, చిరాకు కలుగుతూన్నా పాకెట్‌లో డబ్బుండి గలగల లాడినప్పుడు కూడా అంతులేని అసంతృప్తి పేరుకుని ఉండేది. దాన్ని అణిచిపెట్టడానికి విచ్చలవిడిగా ఖర్చుపెట్టి, కొన్ని సాంఘిక నియమాల్ని పక్కన పెట్టి విశృంఖలంగా సంచరించటంలో కూడా కావలసినది దొరకలేదు.

రెండు మూడు సార్లు తాగాడు. ఒక పక్క తప్పుపని చేస్తున్నా నన్న భావన, అందులో క్షణికంగా లభ్యమయే సుఖాన్ని కూడా చేరనిచ్చేది కాదు. తాగటం అనేది తప్పు కాదని, తాగని వాడు మడికట్టుకుని కూర్చున్న పిచ్చి సన్యాసి అనే సిద్ధాంతాన్ని ఒంట బట్టించుకున్నాక కూడా, చెరువంతగా పెరిగిపోతూన్న దాహం, పరిమితి లేని పేకమేడల కలలూ ఆ నిషాలో కనిపించేవిగాని, తరవాత ఊరంతా అప్పులా, పాపంలా పెరిగిపోతూన్న

క్రిస్టల్
ముసినవ్వుల
చమత్కారం
క్రిస్టల్‌యొక్క
మెరిసే పళ్లు
క్రిస్టల్‌యొక్క
సువాసిత ఊపిరి!



క్రిస్టల్ ముసినవ్వుల ప్రతి బింబంలో ఉత్సాహ భరిత జీవనం సర్వవిదితం. దీనికి కారణం — క్రిస్టల్ యొక్క సుగుణం క్రిస్టల్ టూత్‌పేస్టు యందుగల అత్యంత గుణకరమైన పదార్థాలు దంత క్షయమును అరికట్టి-పళ్లను రోజంతా పరిశుభ్రంగాను తాజాదనంగాను వుంచుతాయి.

క్రిస్టల్
టూత్ పేస్ట్
ఎన్.ఎల్.ఎన్. డి.సి.పి. తో గూడినది.




అత్యధిక నురుగు—అత్యధిక సువాసన 2 సైజులలో లభించుచున్నది. అలెంబిక్ హోంప్రో ఉత్పత్తి.
everest/360 g/ACW·TL

ఆఫీసు ఫైళ్ళా, జీవితం మీదా, భౌతిక సుఖాల మీదా అసహ్యం — ఒక్కుమ్మడిగా దాడిచేసి, ఆ అలవాట్లను మాన్పించేశాయి.

తాగిన మనిషిలో, లోపల మనిషి నిషాల్లో బయట బడతా డన్నది లోకం నమ్మిన నిజం. నిషాలో, నరహరి—చంద్రశేఖరాష్టకంలోని దేవుడి మీద పద్యాలూ, భజన పార్టీలోని కీర్తనలూ, హేమ సౌందర్యం మీద సీస పద్యాలూ అనర్గళంగా చదివేవాడు.

మతంమీద, ఫిలాసఫీ మీద, ఆర్య సంస్కృతి మీద తనకు అంతర్గతంగా ఉన్న వల్లమాలిన అభిమానం అనీ, హేమలాంటి మెరుపు తీవ తన జీవితంలో జొరబడి జీవితాన్ని పచ్చడి చేసేసిందనీ డబ్బా కొట్టినా, తను సామాన్య మానవుడిగా బ్రతుకుకి ఎదురు నిలిచి పోరాడలేని నిస్సహాయతని ముసుగేసి పలాయన మంత్రం పటిస్తూ, ఇతరులనేకాకుండా, తనని తాను మోసం చేసుకుంటున్నాడని తెలుసుకున్నప్పుడు గుండెలు పిండేసే దుఃఖం వచ్చేది. దానికి తగ్గట్టుగా అంతస్తులోని వ్యత్యాసాలు మరింత స్పష్టమై ఉక్కిరి బిక్కిరి చేసేవి.

అదృష్టం తన్నుకొచ్చి, ఆఫీసరుగా వెలిగిపోతూన్న ఇరవై నిండని కుర్రాడు— "ఏమయ్యా, నరహరీ, ఇది తలకాయ ఉండే రాస్తున్నావా?" అని చివాట్లు పెట్టినప్పుడు —

'అయ్యా! తప్పయిపోయిందండీ!' అని వినయంగా క్షమాపణ చెప్పుకోవటం కంటే తలకాయ తీసేసుకోవటం మంచి దనిపించినప్పుడు, ఆఫీసరు చేసిన తప్పుల్ని తను కనిపెట్టి కూడా, అతనికి కోపం తెప్పించ కూడదని ఉద్యోగాన్ని తిట్టుకున్నప్పుడు, వ్యక్తిత్వం అనేదానికి విలువ దొరికేది అంతస్తులో ఉన్న వాడికే అన్న నిజం తెలిసేది.

ప్యూన్ రంగయ్యలో ఆఫీసరుకు లేని సుగుణాలని ఎవడూ హర్షించడు. మనిషికీ, మనిషికీ మధ్య సృష్టించే గోడ, అందరికీ సామాన్యమైన ప్రేమ, కామం, క్షమ, మమత అనే సున్నితమైన భావాల్ని చొరనీయకుండా, దుర్భేద్యంగా తయారవుతుంది.

ఒక మేస్త్రీ ఆడ కూలీతో చేసే సరాచికం వల్గర్ అయితే, ఆఫీసర్ స్టెనోతో ఫ్లర్ట్ చేయటం అతని రసికత్వాన్ని, కులాసా వ్యక్తిత్వాన్ని మెరుగులు పెడుతుంది. ప్రపంచాన్ని కొత్తగా చూస్తున్నట్లు అనుభూతి చెందుతూన్న నరహరి, రోడ్డు పక్కన చెప్పులు కుట్టుకుంటూన్న మనిషిని చూసి నప్పుడు కూడా, "అరటి తొక్కా" "ఒల్లిచెక్కా" తమ లోతు కనుక్కో మన్నట్లుగా, పంచిన తల పెత్తని వాడి ముడతలు పడిన నుదురు, బ్రతుకులోని కర్కశత్వాన్ని, జీవితానుభవం మిగిల్చిన శూన్యాన్ని వ్యక్తం చేస్తూ, సవాలు చేస్తూ కంపరం కలిగించేది.

మనిషి గమనాన్ని తీర్చిదిద్దేదీ, బ్రతుకుల్ని శాసించేదీ డబ్బు అన్న నిజం ఉద్యోగంలో చేరిన ఒక్క సంవత్సరంలో తేలిపోయింది.

సంవత్సరంలోనూ నరహరి ఇంటికి వెళ్ళింది ఒక్కసారి. అదీ బి. ఎస్‌సి. పరీక్షకి కట్టేందుకు.

తండ్రిని జబ్బు ముదరబెట్టి మంచాన పడేసింది. మూడు నెలల కోసారి నరహరి పంపే పందరూపాయలూ తిండికే చాలక పోగా, మందులు కొనే ప్రశ్నే ఉత్పన్నమయ్యేది కాదు.

"రమకి కొడుకు పుట్టాడ్రా! కాన్పుకి కూడా తీసుకురాలేక పోయాం. నీ కొచ్చే




BSCM-2/72TEL

ఆశ్చర్యం, పట్టరాని సంతోషం — మాటలు చాలని భావాలకీ, భావాల కందని అవ్యక్తమైన ప్రేమకీ అతీతమై ఒక్క క్షణం ఇద్దర్నీ స్తబ్ధులుగా చేసింది.

రమ, నరహరిని ఇన్నాళ్ళూ ఎక్కడున్నాడో, ఏం చేశాడో ప్రశ్నించలేదు. నరహరి చెప్పే ప్రయత్నం చెయ్యనూ లేదు. ఇద్దరికీ అంతా తెలిసినట్లుగా, ఏమీ జరగనట్లుగా అనిపించింది.

బాబిని, చిన్నిగాణ్ణి, వేంకట రమణని, ఏడాది నిండని వరహాలుని పక్కన పెట్టుకుని పాపాయిలా ఆడుకున్నాడు.

రమ భర్త ఆఫీసునుంచి వచ్చాక, ఇద్దరూ కలిసి భోంచేశాక, చిన్ననాటి స్నేహితుల్లా కబుర్లు చెప్పుకున్నారు.

అతను ఆఫీసరు చేసే అవకతవక పనులనీ, అతన్ని మంచి చేసుకుని కొట్టేసిన ప్రమోషన్‌నీ, బాబిగాడికి స్కూల్లో ఆటల్లో వస్తూన్న బహుమానాల్ని గురించి గంటసేపు చెప్పాడు.

తరవాత 'సాగర్ సర్కస్'లో తను చూసిన బఫూన్‌గాడి హాస్యం తలుచుకుని, తలుచుకుని పదే పదే నవ్వాడు.

చివరికి, "ఒక్కడివి వచ్చావేం? అక్కగార్ని జనానాలోనే ఉంచేశావా?" అని హాస్యం చేస్తున్నట్లుగా మాట్లాడాడు.

"లేదు. రాణీవాసంలో ఖైదీని చేశాను" అన్న నరహరి మొహం ఎర్రబడింది. ఆ తరవాత, ఆ మాట తప్పించి వేరే కబుర్లు చెప్పటం ప్రారంభించాడు.

నరహరి వచ్చాక, నరహరితో మాట్లాడటానికి రమకి తీరిక చిక్కలేదు. ముఖం నిండా మసి పులుముకుని, చిన్న పిల్లగా గెంతులేస్తూ వంటింట్లో పిండి వంటలూ, అరగంటకోసారి కాఫీలూ బాబిగాడి చేత సరఫరా చేయటంలో మునిగి పోయింది.

పదేళ్ళు నిండుతూన్నా, బావగారి చిరుబురులూ, చెల్లెలి సెన్స్ ఆఫ్ హ్యూమరూ ఇంకా తగ్గలేదనిపించింది.

మనిషి చిక్కిపోయినా, మెడలో నల్లపూసల దండ వేలాడుతూన్నా, రమలో ఉత్సాహం అణువంతైనా తగ్గలేదనీ ఆనందం తాండవిస్తూన్న అంద,


# అలంకరణకి తుది మెరుగు?

కాదు...అవి ఆమె సౌందర్యానికి తుది మెరుగు కాదు. ఆమెది మంచి అభిరుచి, భారతీయ నగలు పెట్టుకుంటేనే తనకి అందం, సంతృప్తి అని ఆమెకు తెలుసు....ఇప్పుడు ఆమె అలంకరణ పరిపూర్ణమైంది.

భారతీయ నగలు మీకూ సొగసు చేకూరుస్తాయి... అవన్నీ చేతితో తయారైనవే... అన్ని సమయాలకి, అన్ని అభిరుచులకి... భారతీయ నగలు ప్రపంచ ప్రజల హృదయాలని చూరగొన్నాయి.




davp 71/204

మొహాల్లో 'లేమి' అనేది మచ్చుకయినా కనిపించటం లేదని గ్రహించాడు.

వెళ్లిపోయే ముందు, నరహరి చెల్లెలు దగ్గరికి వచ్చి, "బాబిగాడికి ఉద్యోగం చేస్తున్నప్పుడు ఏమీ ఇవ్వలేకపోయాను. ఇది కాదంటే నన్ను చంపుకు తిన్నంత ఒట్టు" అని చెప్పి, తను ప్రత్యేకంగా తయారు చేయించి తెచ్చిన ఖరీదయిన ఉంగరాన్ని వేంకటరమణ వేలుకు తొడిగాడు. టేబిల్ సొరగులో రెండు నోట్ల కట్టల్ని కుక్కాడు.

రమణగాడి మొహం మతాబాలా వెలిగినా, రమ ఎప్పటిలా — 'పిచ్చాడివిరా, అన్నాయ్' అన్నట్లు చూసినప్పుడు నరహరికి కోపం వచ్చింది.

'నిజం! ఈ ఆడవాళ్లింతే! పెళ్లయ్యాక వీళ్లకి పుట్టింటి మీద అపేక్ష తగ్గిపోతుంది' అనుకున్నాడే గాని, రమకి ఇప్పుడు నలుగురు పిల్లలని, తను ఓ పదేళ్ల తర్వాత చెల్లెల్ని చూడటానికి వచ్చాడని గుర్తు రాలేదు.

'అన్నయ్య నిజంగా మారిపోయాడు. ఈ పిచ్చి అన్నయ్య నిజంగా పిచ్చాడు' అనుకుంది. అనుకున్న క్షణమే అతను వెళ్లిపోతున్నాడని గుర్తొచ్చిందో ఏమో కళ్లలో నీళ్లు గిరగిరా తిరిగాయి.

కళ్లలో నీళ్లు నింపుకున్న చెల్లితో— "నాన్నని కారులో తిప్పాలని కలలు కన్నాను. అమ్మకిప్పుడు ఏడు వారాల నగలు చేయించ గలను. పదేళ్ల జీవితంలో చాలా పోగొట్టుకుంటానని తెలియదు. కనీసం నువ్వయినా గుర్తు పెట్టుకో, అమ్మా" అని చెప్పిన నరహరి ఏడుపును దాచుకోలేక పోయాడు.

నరహరి వెళ్లిపోవటానికి బయలుదేరే ముందు దాకా, గుమ్మం మీద వేలాడదీసిన ఫొటో చూడలేదు. చూశాక తక్షణం అతని ముఖ కవళికలు మారాయి. కళ్లు కుంచించుకు పోయాయి. తీక్ష్ణంగా ఫొటోకేసి చూస్తున్న అన్నయ్య—రమకి అర్థం కాలేదు.

"అది హేమ పెళ్లి ఫొటోరా! ఎవరో అరవ్వాణ్ణి ప్రేమించిందట. మద్రాసులో ఉంటోంది. బావని కాదని కట్టుకున్నందుకు శిక్ష అనుభవించింది. ఆ ఫొటోలోని మగరాయుడికి దమ్మిడీ సంపాదన లేదు. బంగారం లాంటి చదువుని పాడుచేసుకుంది. ఆ సెంకిపిల్ల ఉత్తరాల్లో నిచారం ఉందనుకున్నావేమో ... అది జగ మొండి ..."

"రమా!" అని చిరాగ్గా పిలిచాడు నరహరి. చెల్లాయి నోటికి తాళం వేసింది. "నువ్వేం నాకు చెప్పకు. నేను ఉంటోంది మద్రాసులోనే" అన్నాడు.

"ఇప్పుడు తిన్నగా బొంబాయి పోతావా?" అన్న బావగారి ప్రశ్నకి "సెంట్రల్ జైలుకి" అన్న నరహరి సమాధానం ఏక్సిలేటర్ నొక్కినట్లుగా, గంటకి అరవై మైళ్ల వేగంలో వస్తున్న తుఫానులా హోరు మని నవ్వించింది.

అదే మోతాదులో నవ్విన నాగరాజు, కటకటాల్లోంచి నరహరిని చూసి, "అబ్బో! గొప్పోడి వయ్యావే! ఇంకా ఈ నాగరాజుని మరిచిపోలేదన్న మాట" అని మీసం దువ్వి నరహరిని దగ్గరగా పిలిచి, "బీడీలు కాల్చి కాల్చి నాలుక పీకుతోంది. ముందు 'టీ', రెండు గోల్డు ఫ్లేక్ సిగరెట్లు తెప్పించు" అన్నాడు. ఆ తరవాత అవి తెప్పించాకా, తాగేదాకా మాట్లాడలేదు. సిగరెట్ రెండు గుక్కలు లాగి ఆర్పేసి —

"చూశావా! నేను దుర్మార్గుణ్ణి. వచ్చి వుండాళ్ళోర్ని. అందుకని దాన బ్బా డబ్బు చూపించి మోసం చేస్తాడటయ్యా? అది ... అడ్డమైన మగాణ్ణి నా ఎదురుగా తెప్పించుకుంటుందయ్యా! దెబ్బకి సఫా చేశాను. నేను దొంగ రాస్కెల్ నయితే, నా పెళ్లాం పోకిరీ ముండ కావాలని ఏదైనా రూలుందా? ఆ అడ్డ గాడిద అలా మాట్లాడతాడేం? నువ్వు నా డియరెస్ట్ ఫ్రెండ్‌వి! పదేళ్లయినా మరిచిపోకుండా వచ్చావ్. నువ్వు జెంటిల్‌మెన్ కాదన్న పీనుగుని గుండెపి కాల్చేస్తాను. నేను చెడుగా ప్రవర్తిస్తే, డర్టీ రోగ్స్ అంతా నా బంధువులూ, స్నేహితులూ కావాలని చెప్పే మనుషులకి ఏం గడ్డి పెట్టమంటావ్?" అన్నాడు.

నాగరాజు సెలంకి జడిసి, వార్డెను నరహరిని తనతో తీసుకుపోబోయాడు. నరహరి చొక్కా పట్టుకొని అతనిని వెళ్లనియ్యకుండా ఆపి, నాగరాజు తను చెప్ప దలచుకున్న వాటిగూ చెప్పేశాడు. "చూడు, నరహరీ! ఇది నా తప్పు కాదు. ఇది నంశంది. వారసత్వంది. నేను మనిషిని మనిషిగా గౌరవిద్దాం అని ప్రయత్నిస్తాను. ఇక నా వల్ల కానప్పుడు, నా ప్రయత్నంతో సంబంధంలేని దుర్మార్గానికి ఎప్పుడూ విచారించను. మనిషి ఎలాటి వాడు కానీ, ఎట్లాంటి పరిస్థితిలో ఉండనీ, జీవితంతో రాజీ పడితేగాని బ్రతకలేడు. నాకు ఉరిశిక్ష పడలేదు. ఈ చీకటి గుహ అంతకన్నా నరకమని నాకు తెలుసు. అయినా, నేను బ్రతకటానికి ప్రయత్నిస్తున్నాను, నరహరీ, బ్రతుకుతాను" అని చెప్పి, నరహరి రెండు చేతులు పట్టుకుని ఒక్క క్షణం మౌనంగా ఉండిపోయాడు.



'నమో భరతమాత'

చిత్రం— మారేమండ శ్రీనివాసరావు (గుంటూరు)

తరవాత—"థాంక్స్! 'చంఘీజ్ ఖాన్' షో ప్రాక్టీస్ చేస్తున్నాను. గుడ్‌లక్ అండ్ విష్ మీ గుడ్‌లక్!" అని కరచాలనం చేసి మొహం తిప్పేసుకున్న నాగరాజుని చూసి నివ్వెరపోయి, వెనక్కి తిరిగాడు నరహరి.

ప్రపంచంలో ఎంతో చూశానని, ఇంకెంతో తెలుసుకున్నానని, విజయ దుందుభిని మోగించానని నరహరి అనుకోలేదు. జీవితంలో లోటుని భర్తీ చేశానని అనుకోలేదు.

ఈ పదేళ్ళ జీవితంలో తను జూదం ఆడాడు. తను గెలిచాడో, ఓడిపోయాడో తెలుసుకునేందుకు వచ్చాడు.

నరహరి కారు గంటకి డెబ్భై మైళ్ల వేగంతో పోతూంది. ఆలోచనలు దానికన్నా రెట్టింపు వేగంతో పయనిస్తున్నాయి.

మూర్తిని చూశాడు. మూర్తిలో తనకు కావలసిన జవాబు దొరికింది.

(సశేషం)